TGTEL/26/A4846

# నవ సంఘర్షణ

తెలుగు దినపత్రిక

www.navasangharshana.com

హైదరాబాద్ సంపుటి: 01. సంచిక: 89 గురువారం 30-07-2026 చీఫ్ ఎడిటర్: మేడి నరేష్ పేజీలు- 4 వేల :6.00/-

## గుజరాత్ ఆయుర్వేద వర్సిటీ పేపర్ లీక్?




గాంధీనగర్,
బీజేపీ పాలిత గుజరాత్‌లోని ఆయుర్వేద యూనివర్సిటీలో ఒక పరీక్ష పేపరు లీకైనట్టు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేద మెడిసిన్ అండ్ సర్జరీ కోర్సుకు చెందిన శల్య తంత్ర-1 (శస్త్రచికిత్స పద్ధతులు) పత్రం లీకైనట్టు పలువురు విద్యార్థులు ఆరోపించారు. దీంతో ఏబీవీపీ, ఎన్‌ఎస్‌యూఐ విద్యార్థి సంఘాలు ఆందోళన నిర్వహించాయి. దీనిపై దర్యాప్తు జరిపి, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. నీట్ పేపర్ లీక్‌పై కాక్రోచ్ జనతా పార్టీ దేశ వ్యాప్త నిరసనకు ఐదు రోజల ముందు గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో ఈ పేపర్ లీక్‌కు సంబంధించి విస్తృతంగా ప్రచారం జరిగింది. ముఖ్యమైన ప్రశ్నలు పేరుతో లీకైన పేపర్‌కు సంబంధించిన ప్రశ్నలు వాట్సాప్‌లో ప్రచారం అయినట్టు గుర్తించారు.




## మాట వినకుంటే
# ప్రభుత్వాన్ని మారుస్తాం!

- విద్యార్థులు టెర్రరిస్టులు కాదు
- వారితో మంచిగా ప్రవర్తించండి
- హామీలను నిలబెట్టుకోండి
- రైతులు..విద్యార్థులు, యువతను ఒకే వేదికపైకి తెస్తాం
- కేంద్రానికి సీజేపీ చీఫ్ అభిజీత్ దీప్కే హెచ్చరిక

"విద్యార్థులను వేధించడం ఆపకపోతే ప్రభుత్వాన్నే మారుస్తాం.. వారు టెర్రరిస్టులు కాదు, దేశ భవిష్యత్తు" అంటూ కేంద్ర ప్రభుత్వానికి సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఘాటు హెచ్చరిక చేశారు. విద్యార్థులపై పోలీసు చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేసిన ఆయన, రైతులు--విద్యార్థులు--యువతను ఒకే వేదికపైకి తీసుకొచ్చి మోడీ ప్రభుత్వాన్ని అన్ని వైపుల నుంచి చుట్టుముట్టే ఉద్యమాన్ని చేపడతామని ప్రకటించారు.

### మోడీ సర్కార్‌ను చుట్టుముడతాం

ముంబై:-
నిరసనకారులైన విద్యార్థులను ఇబ్బంది పెట్టడం మానకపోతే ప్రభుత్వాన్ని మారుస్తామని కేంద్రాన్ని క్రాంచ్ జనతా పార్టీ(సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హెచ్చరించారు. బుధవారం మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం నిరసనకారులైన విద్యార్థులను ఇబ్బంది పెట్టడం ఆపాలని కోరారు. ప్రభుత్వం ఇప్పుడు మంచిగా ప్రవర్తించాలి. జులై 20న పార్లమెంటు వైపు నడుస్తున్నప్పుడు వీధుల్లో

-మిగతా 2 లో

## ప్రజాస్వామ్యానికి ఓటు హక్కే
# మూలస్తంభం

- ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకెళ్తాం
- పారదర్శకంగా గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఢిల్లీలో ముగిసిన టీపీసీసీ సమన్వయ కమిటీ భేటీ

హైదరాబాద్,
భారత ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి పౌరుడి ఓటు హక్కే మూలస్తంభమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేలా పకడ్బందీ కార్యాచరణను సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. బుధవారం ఢిల్లీలోని ఏఐసీసీ జాతీయ కార్యాలయం 'ఇందిరా భవన్'లో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన టీపీసీసీ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, సీతక్క, ఏఐసీసీ సెక్రటరీ వంశీచంద్ రెడ్డి, సహా పలువురు ముఖ్య నేతలు హాజరైన ఈ భేటీ ముగిసిన అనంతరం డిప్యూటీ సీఎం భట్టి

-మిగతా 2 లో






## తెలంగాణలో పోలీస్ కొలువుల జాతర

- 7,437 ఉద్యోగాల భర్తీకి నాలుగు నోటిఫికేషన్లు విడుదల
- సివిల్, ఏఆర్, ఎస్‌పీఎఫ్, ఫైర్, జైళ్ల శాఖల్లో భారీ నియామకాలు
- నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ గుడ్‌న్యూస్
- పారదర్శకంగా నియామకాలు చేపడతామని ప్రభుత్వం స్పష్టం
- పేపర్ లీకేజీలకు అడ్డుకట్ట వేసేలా సంస్కరణలు అమలు
- 15 నెలల్లో 67,760 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,-
పోలీసు ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ తెలిపింది. సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, ఫైర్, జైళ్ల శాఖలో 7,437 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటి భర్తీకి పోలీసు నియామక మండలి నాలుగు నోటిఫికేషన్లు విడుదల చేసింది. తెలంగాణలోని నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త తీపి కబురు అందించింది. హోంశాఖ పరిధిలోని వివిధ విభాగాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి రంగం సిద్ధం చేసింది. పోలీసు, జైళ్లు, అగ్నిమాపక శాఖ, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగాలలో దాదాపు 7 వేల 437 పోస్టుల భర్తీకి ప్రభుత్వం అధికారికంగా ఆమోదముద్ర వేసింది. ఇందులో భాగంగా 5 పోలీస్ పోస్టుల భర్తీకి సంబంధించిన జీవోలు జారీ కాగా..

-మిగతా 2 లో




## అమిత్ షాను పదవి నుంచి తొలగించాల్సిందే..

- విద్యార్థులపై దాడికి ఆయనే బాధ్యుడు
- హోం మంత్రి పదవి నుంచి వెంటనే తొలగించాలి
- ప్రధాని మోదీ తక్షణమే చర్యలు తీసుకోవాలి
- తెలియకపోయినా అనర్హుడే.. ఆదేశిస్తే ప్రధాన నిందితుడే
- పెల్లెట్ గన్స్, ఎలక్ట్రిక్ బ్యాటన్స్‌తో దాడి చేశారన్న ఆరోపణ
- క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదన్న రాహుల్
- మైనర్లపై కూడా పోలీసుల దాడి జరిగిందని ఆరోపణ
- విద్యార్థులపై అదనపు బలగాల వినియోగంపై తీవ్ర అభ్యంతరం

ముంబై:
కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. విద్యార్థులపై లాఠీఛార్జికి, హింసకు కారకుడు అమిత్ షా అని, ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని మోదీ చర్య తీసుకోవాలని కోరారు. ఢిల్లీలో బుధవారం జరిగిన ఒక మీడియా సమావేశంలో రాహుల్ మాట్లాడారు. నీట్ పేపర్ లీకేజీ, సీజేపీ ర్యాలీ సందర్భంగా విద్యార్థులపై జరిగిన దాడి గురించి స్పందించారు."ఢిల్లీ పోలీసు వ్యవస్థ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పని చేస్తుంది. అలాగే, కేంద్ర బలగాలు కూడా హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోనే పని చేస్తాయి. దేశ రాజధాని ఢిల్లీలో వారంతా కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలోనే పని చేస్తారు. ఢిల్లీలో నిరసన చేసిన యువత, విద్యార్థులపై పెల్లెట్ గన్స్, ఎలక్ట్రిక్ బ్యాటన్స్, మేకులున్న లాఠీలు ప్రయోగించారు. పెల్లెట్ గాయాలు, లాఠీ గాయాలున్న విద్యార్థుల్ని చూశాను.

-మిగతా 2 లో

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు



- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- దశలవారీగా ప్రతి కుటుంబానికీ మంజూరు
- రూ.21వేల కోట్లతో రైతన్నపై రుణభారం తగ్గించాం
- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం
- ఖమ్మం రూరల్ మండలంలో రూ.7.21 కోట్ల రోడ్డు పనులకు శంకుస్థాపన

2

## కర్ణాటకలో 7 వేల మంది
# విద్యార్థులకు హెచ్ఐవీ




బెంగళూరు:-
కర్ణాటకలో యువతలో హెచ్ఐవీ ఇన్‌ఫెక్షన్ పెరుగుదలపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాలల్లో హెచ్ఐవీ పరీక్షలు, కౌన్సెలింగ్ శిబిరాలను తప్పనిసరి చేసింది. అయితే ఎవరి అనుమతి లేకుండా ఎలాంటి పరీక్షలు లేదా స్క్రీనింగ్ నిర్వహించబోమని అధికారులు

-మిగతా 2 లో



## అర్హులైన ఒక్క ఓటు కూడా
# నష్టపోవద్దు

- మరో రెండు, మూడు రోజుల్లో సర్ తొలి దశ ముగింపు
- బీఎల్‌ఓలు, పార్టీ నాయకులు అప్రమత్తంగా పనిచేయాలి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్,
రాష్ట్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియ తొలి దశ మరో రెండు, మూడు రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో పార్టీ బీఎల్‌ఓలు, నాయకులు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా నష్టపోకుండా చూడాలని, ఓటు హక్కును ప్రతి అర్హుడు తప్పనిసరిగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రెండో దశ సర్ కార్యక్రమంలో జిల్లా, మండల కార్యవర్గ ప్రతినిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, వంద శాతం విజయవంతంగా కార్యక్రమాన్ని పూర్తి చేసేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని మహేష్ కుమార్ గౌడ్ ఆదేశించారు

-మిగతా 2 లో



## ట్రంప్ చేతికి సుంకాల కొరడా

- భారత్, చైనాలపై 100 శాతం పన్నుల బిల్లు
- 86-12 ఓట్ల తేడాతో సెనెట్‌లో విజయం
- ట్రంప్ చేతికి కొరడా ఇచ్చిన చట్టం

వాషింగ్టన్:
భారత్, చైనాలపై 100 శాతం సుంకాలనూ విధించాలని కోరుతూ రష్యా ఆంక్షల బిల్లును అమెరికా సెనెట్ ముందుకు తీసుకెళ్లింది. రష్యా చమురు, గ్యాస్‌ను ప్రధానంగా కొనుగోలు చేసే దేశాలైన చైనా, భారత్ ల నుండి వచ్చే వస్తువులపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారాన్ని ఈ బిల్లు ట్రంప్‌కు ఇస్తుంది. రష్యా ఇంధనాన్ని కొనుగోలు చేసే దేశాలపై మరిన్ని ఆంక్షలు విధించడానికి, ఇరాన్‌పై జరిమానాలను పొడిగించడానికి ఉద్దేశించిన, చాలా కాలంగా ఎదురు చూస్తున్న ఉభయపక్షాల (బైపార్టిసన్) బిల్లును అమెరికా సెనెట్ 86-12 తేడాతో ఆమోదించి, ముందుకు తీసుకెళ్లింది. దివంగత సెనేటర్ లిండ్సే గ్రాహం ప్రతిపాదించి, చాలా కాలం నిలిచిపోయిన ఈ చట్టం ఆమోదానికి మార్గం సుగమం చేసింది. ఈ బిల్లు రష్యా చమురు లేదా సహజ వాయువును ప్రపంచంలోని ఐదు అగ్ర కొనుగోలుదారులైన భారత్, చైనాలతో సహా ఇతర దేశాలపై సుంకాలు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇస్తుంది. ట్రంప్ మద్దతు పొందిన ఈ బిల్లుకు 86-12 ఓట్ల

-మిగతా 2 లో

## దూకుడుగా
# వాయుగుండం

### పలు జిల్లాల్లో కుండపోత వానలు

- ఉప్పొంగుతున్న వాగులు.. వంకలు
- మరో 36 గంటలపాటు భారీ వర్షాలు
- ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
- భోగత జలపాతం దూకుడు
- ఆలస్యంగానైనా ఖరీఫ్ సాగుపై చిగురిస్తున్న ఆశలు

హైదరాబాద్,
వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణ తడిసిముద్దయింది. రెండు రోజులుగా పలు జిల్లాల్లో మబ్బులుగా ఉండి ఉదయంకల్లా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగుతుండటంతో తెలంగాణ జలకళను సంతరించుకుంటోంది. పలు చోట్ల వరద ఉధృతికి రహదారులు కొట్టుకుపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇవే పరిస్థితులు మరో రెండు రోజులపాటు ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఆలస్యంగానైనా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ సాగుపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం తెలంగాణ వైపుకు దూసుకొస్తోందని హెచ్చరించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాగల 36 గంటల్లో అత్యంత భారీ నుంచి

-మిగతా 2 లో



## మాట వినకుంటే ప్రభుత్వాన్ని మారుస్తాం!

(మొదటి తరువాయి)



విద్యార్థుల రక్తం చిన్నింది. అది చాలా చెడ్డది. అది చాల్లేదా? ఇప్పటికీ విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారు. అనేక రాష్ట్రాల్లో పోలీసులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి అరెస్టుల బెదిరింపులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. విద్యార్థులు ఉగ్రవాదులు కాదు. వారు మన దేశ భవిష్యత్తు. దేశ భవిష్యత్తును ఇలా ఇబ్బంది పెడితే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లే రేపు ప్రభుత్వం సరిగా ప్రవర్తించకపోతే మేము వెళ్లి ప్రభుత్వాన్ని మారుస్తాము అని అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై జరిగిన దేశవ్యాప్త నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై ఇప్పటికీ పోలీసు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం హామీలను పాటించాలని, విద్యార్థులను లక్ష్యంగా చేసుకోవడం ఆపాలని ఆయన కోరారు.

మోడీ సర్కార్‌ను చుట్టుముడతాం

రైతు నాయకుడు రాకేష్ తికాయత్‌తో సీజేపీ ప్రతినిధి అశుతోష్ రంకా మంగళవారం భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సీజేపీ నాయకులు, భారతీయ కిసాన్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. రైతులు విద్యార్థులు యువతను ఒకే వేదికపై ఐక్యం చేయడమే ఈ సమావేశ ప్రధాన అంశం అని సీజేపీ తెలిపింది.

సమావేశం తర్వాత రంకా మాట్లాడుతూ మా రైతు సోదరులు, ఈ దేశ విద్యార్థులు, యువత కలిసి మోడీ ప్రభుత్వాన్ని అన్ని వైపుల నుంచి చుట్టుముట్టేలా పని చేస్తారని ఆశిస్తున్నామని అన్నారు. ఈ సమావేశం సీజేపీ తన 36 రోజుల నిరసనను నిలిపివేసిన కొన్ని రోజుల తర్వాత జరిగింది. సీజేపీ ఇప్పుడు రైతులతో కలిసి విస్తృత కూటమి ఏర్పాటు చేసుకోవాలని చూస్తోందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

## ప్రజాస్వామ్యానికి ఓటు హక్కే మూలస్తంభం

(మొదటి తరువాయి)

విక్రమార్క మీడియాతో మాట్లాడారు సమావేశంలో ప్రధానంగా మూడు అంశాలపై విస్తృత చర్చ జరిగిందని, పార్టీ–ప్రభుత్వ సమన్వయంపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రత్యేక ఓటరు నమోదు (ఎస్‌ఆర్‌ఆర్) ప్రక్రియపై తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించిందని భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) అత్యంత సమర్థవంతంగా పనిచేస్తున్నారని, వారి పనితీరును ఏఐసీసీ సైతం సమీక్షించి అభినందించిందని చెప్పారు. మిగిలిన ఓటరు నమోదు ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేయాలని ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ సూచించారన్నారు.మరొకవైపు, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ క్యాడర్, సంస్థాగత వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ చేర్చేందుకు సమావేశంలో ఒక ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించినట్లు ఆయన వివరించారు. రాబోయే గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల గురించి సమన్వయ కమిటీలో సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు. ముందుగా గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదును వేగవంతం చేయడంతో పాటు, ఎమ్మెల్సీ బరిలో నిలిచే ఆశావాహుల ఎంపిక పారదర్శకంగా జరిగేలా చూడాలని నిర్ణయించామన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఆయా జిల్లాల ఇన్చార్జి మంత్రులకు కీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. మంత్రులు తమ జిల్లాల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు (డీసీసీ), ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులతో విస్తృతంగా చర్చించి.. ముగ్గురు సభ్యులతో కూడిన ప్యానెల్ను పార్టీ అధిష్టానానికి సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మొత్తంగా ఓటరు నమోదు, ప్రభుత్వ పథకాల ప్రచారం, ఎమ్మెల్సీ ఎన్నికల వ్యూహాలపై భేటీలో స్పష్టమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకుని, వాటి అమలుకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు భట్టి విక్రమార్క మీడియాకు వివరించారు.

## తెలంగాణలో పోలీస్ కొలువుల జాతర




మిగిలిన 2 వేల పోస్టుల భర్తీకి సంబంధించిన ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి. గతంలో 2015, 2018, 2022లలో భారీగా నియామకాలు జరగగా.. తాజా ప్రకటనతో నిరుద్యోగుల ఆందోళనలకు తెరపడింది. శాంతిభద్రతల బలోపేతమే లక్ష్యంగా ఈ నియామకాలు వేగవంతం కానున్నాయని ఉన్నతాధికారులు వెల్లడించారు. త్వరలోనే 5 వేల పోలీస్ ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణలో నిరుద్యోగ సమస్యను తీర్చేందుకు తమ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతోందని వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే ఏకంగా 67760 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన వారు.. పాలకులుగా వచ్చారని.. కానీ తాను మాత్రం ఒక పాలకుడిగానే కాకుండా.. సేవకుడిగా, సామాన్య ప్రజల ప్రతినిధిగా వచ్చినట్లు రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఎన్నికలకు ముందు నిర్వహించిన పాదయాత్రలో రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకున్నానని గుర్తు చేశారు. అందుకే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. “ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే ముందు రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి, అన్ని వర్గాల ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నాను. యువత, విద్యార్థులు ఎక్కువగా ప్రస్తావించిన సమస్యల్లో నిరుద్యోగం, పరీక్షల్లో అవకతవకలు, ముఖ్యంగా గ్రూప్–2 ప్రశ్నాపత్రం లీకేజీ వంటి ఘటనలు ప్రధానమైనవి. నియామక ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయత పెంచేందుకు రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కీలక బాధ్యతల్లో నియమించాం. పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీలను అరికట్టేందుకు కఠిన నిబంధనలు, పటిష్ట పర్యవేక్షణ వ్యవస్థలు, సమగ్ర సంస్కరణలు అమలు చేశాం” అని గుర్తు చేశారు.

## కర్ణాటకలో 7 వేల మంది విద్యార్థులకు హెచ్ఐవీ

(మొదటి తరువాయి)




స్పష్టం చేశారు. దేశంలో అత్యధిక హెచ్ఐవీ బాధితులున్న రాష్ట్రాల్లో కర్ణాటక మూడో స్థానంలో ఉంది. తాజా నివేదికల ప్రకారం రాష్ట్రంలో 18 నుంచి 25 ఏండ్ల మధ్య వయసు కలిగిన ఏడు వేలకు పైగా విద్యార్థులు హెచ్ఐవీ బారిన పడ్డారు.

## అమిత్ షాను పదవి నుంచి తొలగించాల్సిందే..

(మొదటి తరువాయి)

విద్యార్థులపై పోలీసులు, భద్రతా బలగాల దాడికి ఆదేశాలిచ్చింది హోం మంత్రి అమిత్ షానే. ఒకవేళ ఈ విషయం అమిత్ షాకు తెలియకుంటే.. ఆయన ఈ పదవిలో కొనసాగడానికి అనర్హుడు. ఒకవేళ ఈ దాడికి అమిత్ షా ఆదేశించి ఉంటే ప్రధాన నిందితుడు కూడా ఆయనే. విద్యార్థులపై జరిగిన ఈ దారుణ ఘటనలకు బాధ్యుడైన అమిత్ షాను మంత్రివర్గం నుంచి తప్పించాలి. ఈ విషయంలో ప్రధాని మోదీకి కూడా నేను సలహా ఇస్తున్నా” అంటూ రాహుల్ చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో ఈ అంశంపై పార్లమెంట్‌లో ప్రభుత్వం తనను మాట్లాడనివ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. “నేను మాట్లాడేందుకు వీలుగా ఆర్డర్ ఇవ్వాలని లోక్‌సభ స్పీకర్‌ను కోరారు. కానీ, అనుమతి ఇవ్వలేదు. అమిత్ షాపై ఆరోపణలు చేసినందుకు నన్ను అనుమతించడం లేదని, క్షమాపణలు చెప్పాలి అంటున్నారు. క్షమాపణలు చెబితేనే అనుమతిస్తాం అంటున్నారు. నేను బీజేపీకి కానీ, ఆర్ఎస్ఎస్‌కు కానీ, ఏ ఒక్క వ్యక్తికి కానీ క్షమాపణ చెప్పబోను” అంటూ రాహుల్ వ్యాఖ్యానించారు. సీజేపీ నిరసనల సందర్భంగా మైనర్లపై కూడా పోలీసులు దాడి చేశారని రాహుల్ ఆరోపించారు. విద్యార్థులపై అదనపు బలగాల్ని ఉపయోగించడం తీవ్రమైన చర్యగా అభివర్ణించారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
**-దశలవారీగా ప్రతి కుటుంబానికీ మంజూరు**
**-రూ.21వేల కోట్లతో రైతన్నపై రుణభారం తగ్గించాం**
**-కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం**
**-ఖమ్మం రూరల్ మండలంలో రూ.7.21 కోట్ల రోడ్డు పనులకు శంకుస్థాపన**



ఖమ్మం రూరల్

ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటనూ తూచా తప్పకుండా అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన తమ ప్రభుత్వం.. సంక్షేమం, అభివృద్ధిని రెండు కండ్లుగా భావిస్తూ ముందుకు సాగుతోందన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండల పరిధిలో రూ. 7.21 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. డాక్యా తండాలో రూ. 1.41 కోట్లతో మంగళగూడెం--డాక్యా తండా రోడ్డు, పల్లెగూడెంలో రూ. 5.80 కోట్లతో గొల్లగూడెం నుంచి ఎన్ఎస్‌పీ మీదుగా పల్లెగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి మాట్లాడారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. రైతు భరోసా ద్వారా ప్రతి ఎకరానికి రూ. 6 వేల చొప్పున కేవలం 9 రోజుల్లోనే రూ. 9,200 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. రూ. 2 లక్షల వరకు ఉన్న రుణమాఫీ ద్వారా 25 లక్షల మంది రైతులకు రూ. 21,000 కోట్ల మేర ఆర్థిక భారం తగ్గించామని తెలిపారు. సన్న వరిధాన్యానికి మద్దతు ధరతో పాటు అదనంగా రూ. 500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. నాలుగు విడతల్లో నిరుపేదల సొంతింటి కలను నిజం చేయడమే ఇందిరమ్మ ఇండ్ల పథకం లక్ష్యమని స్పష్టం చేశారు. తొలి విడతలో 4.50 లక్షలు, రెండో విడతలో రూ. 2.50 లక్షలతో కలిపి ఇప్పటివరకు మొత్తం రూ. 7 లక్షల ఇండ్లను మంజూరు చేసినట్టు వెల్లడించారు. రెండో విడతలో మిగిలిన గ్రామాలకు త్వరలోనే ఇండ్లు మంజూరు చేస్తామని, రాబోయే మూడో, నాలుగోవ విడతల్లో అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టామని అన్నారు. గ్రామీణ రహదారులు, విద్యాసంస్థలు, తాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి ఆగిపోకుండా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, ఖమ్మం ఆర్‌డీవో ఎన్.శ్రీనివాస్, హౌజింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఈఈ మహేష్‌బాబు, పలువురు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## దూకుడుగా వాయుగుండం

(మొదటి తరువాయి)

తీవ్ర భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ముఖ్యంగా ఉత్తర, పశ్చిమ, ఈశాన్య తెలంగాణ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు హనుమకొండ, భూపాలపల్లి, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, జనిగాం, కామారెడ్డి, ఖమ్మం, కుమురం భీమ్, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీఅయింది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు పడే అవకాశంముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమైన వాతావరణంతో పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. గురువారం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో పరిస్థితులు అత్యంత తీవ్రంగా మారనున్నాయని, కొన్ని ప్రాంతాల్లో గరిష్టంగా 300 మిమీ నుంచి 450 మిమీ వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, దీనివల్ల భారీగా వరదలు ముంచెత్తుతాయని వాతావరణ నిపుణులు సైతం హెచ్చరిస్తున్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకూడదని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.పలు జిల్లాల్లో కుండపోత వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో బుధవారం భారీ నుండి అత్యంత భారీ వర్షాలు కురిసాయి. ములుగు జిల్లా వాజేడు మండలంలోని టేకులపల్లి, పేరూరు గూడేల వద్దనున్న ఇసుకవాగుపై నిర్మించిన డైవర్షన్ రోడ్డు ప్రవాహానికి వర్షపు నీటికి కొట్టుకుపోవడంతో తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ 168ఎ జాతీయ రహదారిపై వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జలపాతం ఉగ్రరూపం దాల్చింది. ఈ నేపథ్యంలో పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అటవీ శాఖ అధికారులు ముందుస్తు చర్యలు చేపట్టారు. భోగత జలపాతం సందర్శనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.నిర్మల్ జిల్లా లక్ష్మణ చందా మండలంలోని ధర్మారం గ్రామం మీదుగా సోన్ వెళ్లే రహదారి వంతెన భారీ వరదలో తెగిపోయింది. ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందుస్తు జాగ్రత్తలు చెప్పారు. వంతెన మార్గాన్ని తాత్కాలికంగా మూసివేసి వాహనాల రాకపోకలు నిలిపివేశామని పోలీసులు తెలిపారు. మంచిర్యాల జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచిర్యాల పట్టణంలోని మాందోరి వెంకటేశ్వర మిషన్ పాఠశాల వద్ద నివాసముంటున్న అయ్యప్ప కనకలక్ష్మి ఇల్లు కూలిపోవడంతో ఆస్తి నష్టం సంభవించింది. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం చెల్పూర్ వద్ద వాగు, కామారెడ్డి జిల్లా నిజాంసాగర్‌లోని నర్సింగరావుపల్లి నల్లవాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. సిద్దిపేట జిల్లా తొగుటలో వర్షపాతం నమోదుగాయింది. భారీ వర్షానికి కామారెడ్డి జిల్లా తీర్మాపూర్ విద్యుత్ ఉప కేంద్రంలోకి వరద నీరు చేరింది.

## ట్రంప్ చేతికి సుంకాల కొరడా

(మొదటి తరువాయి)

తేడాతో ఆమోదం లభించింది. దాదాపు రిపబ్లికన్లందరూ, మెజారిటీ డెమొక్రాట్లు ఏకమై 60 ఓట్ల అడ్డంకి నుండి బిల్లును గట్టెక్కించారు. ఈ నెలలో ఆకస్మికంగా మరణించిన గ్రాహమ్‌కు స్మారక సభ నిర్వహించిన కొన్ని గంటల తరువాత, రష్యా దురాక్రమణను గట్టిగా విమర్శించిన రిపబ్లికన్ సెనేటర్‌ను గౌరవించేందుకు క్యాపిటల్ హిల్‌కు వచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ సెనేటర్లు కలిసిన కొద్దిసేపటికే ఈ బిల్లు ఆమోదం పొందింది.

బిల్లు గురించి

ఈ బిల్లు రష్యా అధికారులు, కుబేరులు, ఆర్థిక సంస్థలు, మాస్కో ఎగుమతులపై ఆంక్షలను తప్పించుకోవడానికి ఉపయోగించే ‘షాడో ఫ్లీట్’ అని పిలువబడే దానిపై ఆంక్షలు విధిస్తుంది. రష్యా చమురు, గ్యాస్‌ను ప్రధానంగా కొనుగోలు చేసే దేశాలైన చైనా, భారతదేశం నుండి వచ్చే వస్తువులపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారాన్ని కూడా ఇది ట్రంప్‌కు ఇస్తుంది. అయితే, తమ సహజవాయువులో 15 శాతం కంటే తక్కువ రష్యా నుండి దిగుమతి చేసుకుంటూ, ఆ దిగుమతులను తగ్గించుకోవడానికి చర్యలు తీసుకుంటున్న దేశాలకు మినహాయింపులు ఇస్తుంది. సవరించిన ఈ బిల్లు ట్రంప్ అభ్యర్థన మేరకు ఇరాన్ ఇంధన, ఆయుధరంగాలకు నిధులను పరిమితం చేయడానికి ఉద్దేశించిన ప్రస్తుత ఆంక్షల అధికారాన్ని కూడా పొడిగిస్తుంది. ఈ చట్టానికి గ్రాహం పేరు పెట్టారు. ఆయన దీనికి మద్దతు కూడగట్టడానికి ఏడాదికి పైగా కృషి చేసి, ఈ నెల మొదట్లో ఆకస్మికంగా మరణించడానికి కొద్ది కాలం ముందు, దీని సవరించిన రూపంపై వైట్ హౌస్‌తో ఒక ఒప్పందానికి వచ్చారు. ఈ బిల్లు మద్దతుదారులు, మాస్కో ఇంధన ఆదాయాన్ని అడ్డుకోవడానికి ఇది అవసరమని, తద్వారా ప్రస్తుతం ఐదవ సంవత్సరంలో ఉన్న ఉక్రెయిన్ యుద్ధానికి నిధులు సమకూర్చే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సామర్థ్యాన్ని బలహీనపరుస్తుందని వాదిస్తున్నారు. ఈ ఉభయపక్ష ఒప్పందంతో ముందుకు సాగడం కంటే సెనేటర్ గ్రాహం వారసత్వాన్ని గౌరవించడానికి ఇంతకంటే గొప్ప మార్గం లేదని ఆరుగురు రిపబ్లికన్, డెమోక్రటిక్ సెనేటర్లు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రష్యాను శిక్షించడానికి విస్తృత మద్దతు ఉన్నప్పటికీ, ఈ సుంకాల నిబంధనలు ట్రంప్‌కు మితిమీరిన అధికారాన్ని కట్టబెడతాయని, అమెరికన్ వినియోగదారులకు దిగుమతి ఖర్చులను పెంచవచ్చని, లేదా యూరోపియన్ మిత్ర దేశాలను దెబ్బతీయవచ్చని కొంత మంది డెమోక్రాట్లు ఆందోళన వ్యక్తం చేశారు.

## గురుపౌర్ణమి సందర్భంగా గాయత్రీపురం గణపతి షిరిడి సాయిబాబా దేవాలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నాయకోటి పవన్ కుమార్ .





**కొత్తపేట - జూలై 29 నవ సంఘర్షణ**
గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తపేట డివిజన్ పరిధిలోని గాయత్రిపురం గణపతి దేవాలయం మరియు షిరిడి సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకోటి పవన్ కుమార్ గణపతి స్వామివారిని, శ్రీ షిరిడి సాయిబాబా వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, భక్తులకు గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, గురువుల ఆశీస్సులు మరియు సాయిబాబా వారి కృపాకటాక్షాలతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ అధ్యక్షులు మంచి రాజేష్ కుమార్ , జిల్లా కార్యదర్శి వగ్గుల సుందర్ నారాయణ , జంగారెడ్డి , కాటా విజయ్ గౌడ్ , లావణ్య , స్వర్ణ , యశోద , రామకృష్ణ , వెంకట్ రెడ్డి , డివిజన్ జనరల్ సెక్రటరీ గట్టు మహేష్ కుమార్ , రాజేష్ ఖన్నా , నందు , పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## ప్రణ యూ సెంటర్లో మెదక్ డిప్ ఆర్టిసి విశ్రాంతి ఉద్యోగుల సంఘం సమావేశం



**రామాయంపేట - జూలై 29 నవ సంఘర్షణ**
ఇంటర్ సెంటర్లో 28బి 7 బి26 ఉదయం 11 గంటలకు డిపో ఆర్టీసీ విశ్రాంతి ఉద్యోగుల సంఘం సమావేశం జరిగింది ఈ సమావేశానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అధ్యక్షతన సమావేశం జరిగింది ఈ సమావేశానికి డిపోఅధ్యక్షులు ఆర్కే రెడ్డి కోశాధికారి సిహెచ్ ఉపాధ్యక్షులు అబ్రబోయిన గంగారాములు రామాయంపేట వారు పాల్గొని కొన్ని విషయాలపై చర్చించారు

## మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా నర్సింహా చారి

**-ప్రధాన కార్యదర్శి గా సంగమేశ్వర్ ఎన్నిక.**



**మెదక్ జిల్లా - జూలై 29 నవ సంఘర్షణ**
మెదక్ ప్రెస్ క్లబ్ 2026-28 సంవత్సరానికి జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మెదక్ పట్టణంలో స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో జరిగిన ఎన్నికల్లో 98 మంది ఓట్లకు గాను 96 మంది ఓటును వినియోగం చేసుకున్నారు. ఓటర్లు బారులు తీరి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. సీనియర్ విలేకరులు బాలేశ్వర్,దేవయ్య, శ్రీధర్, మురళి, ఫారూక్ , ఖయ్యాం , హరినాథ్,బీవీకే రాజు, శంకర్ దయాల్ చారి, గోపాల్ గౌడ్, మన్నే శ్రీనివాస్ తో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హోరాహోరీగా ఎన్నికలు జరుగగా, అధ్యక్ష స్థానానికి గుట్టమీది ప్రకాష్, శివన్నగారి నర్సింహచారి తలపడ్డారు. ప్రకాశ్ కు 42 ఓట్లు రాగా, నర్సింహచారికి 54 ఓట్లు వచ్చాయి. 12 ఓట్ల మెజార్టీతో నర్సింహచారి అధ్యక్షుడిగా గెలుపొందారు.ప్రధాన కార్యదర్శి పదవికి చెవిటి అశోక్, బచ్చు సంగమేశ్వర్ పోటీ పడగా, అశోక్ కు 44 ఓట్లు, సంగమేశ్వర్ కు 52 ఓట్లు వచ్చాయి. ఎనిమిది ఓట్ల మెజార్టీతో సంగమేశ్వర్ విజయం సాధించారు. గెలిచిన అధ్యక్ష, కార్యదర్శులకు ఎన్నికల కమిటీ సభ్యులు మంగ శరత్ చంద్ర గౌడ్, బోనగిరి చంద్రశేఖర్, అల్లాడి శేఖర్, పొగాకు రామకృష్ణ, మహ్మద్ యూసుఫ్ ఆలీ లు ధ్రువపత్రాలు అందజేశారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి



**రామాయంపేట - జూలై 29 నవ సంఘర్షణ**
రామాయంపేట పట్టణం మున్సిపల్ 1వ వార్డుకు చెందిన కంఠం దేవమ్మ గారు ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ కంఠారెడ్డి తిరుపతి రెడ్డి గారు స్పందించారు. స్థానిక నాయకుల ద్వారా బాధిత కుటుంబానికి 5000/- రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాతూరి సిద్దరాములు, పాతూరి సాయి, మద్దూరి భాను, వీణ సల్మాన్, తుడుం వంశీ, మల్లేశం గౌడ్, పరమేష్, చందు, బాబు, అమర్, కాశి, అశోక్, బుర్ర బాబు, బొట్ల సామెల్, మహేష్ పాల్గొన్నారు

# ఇంటిలో నార్మల్ డెలివర్ తల్లి బిడ్డ క్షేమం

**-108 అంబులెన్స్ లో హాస్పిటల్ కి తరలింపు**



**గాంధారి, - జూలై 29 నవ సంఘర్షణ**
మండలం వంద్రికల్ గ్రామానికి కి చెందిన రైపని లక్ష్మి, బుధవారం ఉదయం పురిటి నొప్పులు రావడంతో సహాయం కొరకు 108 కి సంప్రదించగా అక్కడికి వెళ్లిన అంబులెన్స్ సిబంది, తల్లి లక్ష్మి కి 3 వ కనుపూ కావడం వల్ల నొప్పులు ఎక్కువ రావడం వల్ల ఇంటి వద్ద నార్మల్ డెలివరీ జరిగింది. తల్లీ కి పాపకి ట్రేట్మెంట్ ఇస్తూ తరువాత గాంధారి హాస్పిటల్ కీ తరలించారు. మూడవ కనుపూ పాపా పుట్టినందుకు తల్లి లక్ష్మి, భర్త బంధువులు గ్రామ ప్రజలు 108 సిబ్బంది టిఎంటి సురేష్, నరేష్, కృతజ్ఞతలు తెలిపారు.

## మెదక్ జిల్లాలో 90 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి.

**-త్వరలో వంద శాతం పూర్తి కానున్న మెదక్ జిల్లా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ - జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**



**మెదక్ జిల్లా -- జూలై 29 నవ సంఘర్షణ**
జిల్లాలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుందని, ఇప్పటి వరకు జిల్లాలో 90 శాతం పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు.బుధవారం ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పై రాష్ట్ర ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్.ఐ. ఆర్ ప్రక్రియ పై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో మొత్తం ఓటర్లు 4,53140 కి గాను వంద శాతం ఎన్యూమరేషన్ ఫారాలు ఓటర్లకు అందజేసి ఇప్పటి వరకు 90 శాతం ఎన్యూమరేషన్ ఫారాలను 90 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు వివరించారు. రెండు మూడు రోజుల్లో వందశాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ సైతం చేపట్టడం జరుగుతుందన్నారు. ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో 1200 ఓట్ల కన్నా ఎక్కువ ఉన్న పోలింగ్ స్టేషన్లు, 2 కి.మీ. కంటే ఎక్కువ దూరం ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి రేషనలైజేషన్ చేస్తున్నట్లు తెలిపారు. డిజిటలైజేషన్ ప్రక్రియకు గడువు 4,5 రోజులు మాత్రమే మిగిలి ఉందని, వేగవంతంగా పూర్తి చేయాలని అదే సమయంలో తప్పులు లేకుండా ఉండేందుకు ఈ.ఆర్.ఓ లు ర్యాండం గా తనిఖీలు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆర్డీఓ రమాదేవి, సెక్షన్ సూపరింటెండెంట్ గఫార్ , ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గురు పౌర్ణమి సందర్భంగా షిరిడి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.



**ఎల్బినగర్ - జూలై 29 నవ సంఘర్షణ**
గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎల్ బి నగర్ నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఈరోజు బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్ కాలనీలో ఉన్న షిరిడి సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి షిరిడి సాయిబాబా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సుభిక్షంగా ఉండాలని ప్రార్థించార ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కటిక రెడ్డి అరవింద్ రెడ్డి , మనోజ్ , దేవాలయ చైర్మన్ ముడుపు జయ యాదగిరి రెడ్డి , ముడుపు సందీప్ రెడ్డి , పార్టీ నాయకులు, కార్యకర్తలు, దేవాలయ కమిటీ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## దక్షిణ షిరిడి గురుపూర్ణిమ మహోత్సవాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బండారు దత్తాత్రేయ, ఎన్. రామచంద్రరావు, సామ రంగారెడ్డి, బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి.







**ఎల్ బి నగర్, - జూలై 29 నవ సంఘర్షణ**
దక్షిణ షిరిడిగా ప్రసిద్ధి చెందిన గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని దిల్‌సుఖ్‌నగర్ షిరిడి సాయిబాబా ఆలయంలో గురుపూర్ణిమ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. సాయిబాబా దేవాలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు హర్యానా, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ , బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు , ఎల్ బి నగర్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ సామ రంగారెడ్డి , గడ్డిఅన్నారం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ఆలయానికి విచ్చేసి షిరిడి సాయిబాబా వారిని దర్శించుకుని గురుపూర్ణిమ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక ఆశీర్వచనాలు అందించగా, దేవాలయ కమిటీ సభ్యులు అతిథులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, గురుపూర్ణిమ భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానాన్ని చాటిచెప్పే పవిత్రమైన పర్వదినమని అన్నారు. శ్రీ షిరిడి సాయిబాబా వారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సిరిసంపదలతో సుభిక్షంగా జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర, ఐపీఎస్





**గాంధారి, - జూలై 29 నవ సంఘర్షణ**
సదాశివ నగర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రాజేష్ ఐపిఎస్
్ణపరిశుభ్రమైన పోలీస్ స్టేషన్ - సమర్థవంతమైన పోలీసింగ్‌కు పునాది.్ణ ప్రజాసేవే పోలీసు విధి --
ప్రతి ఫిర్యాదుకు సత్వర న్యాయం అందించాలి.్ణ కేసులు, పిటిషన్లు సీసీటీఎన్ఎస్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసి నవీకరించాలి.్ణ రౌడీషీటర్లు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగించాలి. కామారెడ్డి జిల్లా పోలీసు సూపరింటెండెట్ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ బుధవారం సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్, రైటర్ రూమ్, వివిధ రికార్డులు, సీసీటీఎన్ఎస్ నిర్వహణ, ఇతర విభాగాలను పరిశీలించి సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం స్టేషన్ పరిసరాలను సందర్శించి పరిశు భ్రత, నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పరిశుభ్రమైన పోలీస్ స్టేషన్ సిబ్బందిలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించి విధుల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేస్తుందని తెలిపారు. ప్రతి పోలీసు ఉద్యోగి తన ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు కుటుంబ సభ్యులతో సమయం గడపాలని, పిల్లల్లో మంచి విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించేలా తల్లిదండ్రులు ఆదర్శంగా ఉండాలని సూచించారు. జూదం, ఆన్‌లైన్ గేమింగ్ వంటి వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, వ్యక్తిగత క్రమశిక్షణే వృత్తిపరమైన నిబద్ధతకు పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్‌లో నమోదయ్యే ప్రతి కేసు, ప్రతి పిటిషన్‌ను తప్పనిసరిగా సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు నవీకరించాలని, ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని ఆదేశించారు. అలాగే జిల్లా కార్యాలయం నుంచి జారీ అయ్యే సూచనలు రోల్‌కాల్‌లో సిబ్బందికి సక్రమంగా తెలియజేస్తున్నారా అనే అంశాన్ని స్వయంగా పోలీసు సిబ్బందిని ప్రశ్నించి తెలుసుకొని వారితో విస్తృతంగా చర్చించారు. పోలీసు ఉద్యోగం కేవలం విధి మాత్రమే కాకుండా ప్రజాసేవ అనే భావనతో ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించిన జిల్లా ఎస్పీ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా వి.పి.ఓలు తమ గ్రామాలను తరచూ సందర్శించి స్థానిక పరిస్థితులపై అవగాహన పెంపొందించుకోవాలని, కీలక సమాచారం లభించిన వెంటనే సంబంధిత అధికారులకు చేరవేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పిటిషన్‌ను నమోదు చేసి నిష్పాక్షికంగా విచారణ నిర్వహించి అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తుల కదలికలు, జీవన విధానం, కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి నేర నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసే ప్రతి పోలీసు ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా, పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువచ్చేలా సేవలందించాలని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ సూచించారు.ఈ కార్యక్రమంలో సదాశివనగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.సంతోష్ కుమార్, సదాశివనగర్ ఎస్ఐ ఎం. పుష్పరాజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## అబ్బా అనిపిస్తున్న హెబ్బా

# 800కుపైగా ఆర్టిస్టులతో.. శర్వానంద్ భోగి క్లైమాక్స్ షెడ్యూల్ కంప్లీట్




టాలీవుడ్ శర్వానంద్ నటిస్తున్న చిత్రం 'భోగి'. పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రానికి సంపత్‌నంది దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లకు మంచి స్పందన వస్తోంది. కాగా ఆర్ట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్ మన్నె సారథ్యంలో నిర్మించిన భారీ సెట్‌లో స్టంట్ కొరియోగ్రాఫర్ దిలీప్ సుబ్బరాయన్ నేతృత్వంలో క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరిస్తున్నట్టు వార్తలు కూడా వచ్చాయి. ఈ సీక్వెన్స్ కోసం శర్వానంద్‌కు రోజూ రెండున్నర గంటల పాటు మేకప్ సెషన్ పెట్టారట.తాజాగా దీనికి సంబంధించి కీలక అప్‌డేట్ బయటకు వచ్చింది. భోగి 3 నెలల ప్లానింగ్ షెడ్యూల్‌లో 22 రోజులపాటు 800 మందికిపైగా జూనియర్ ఆర్టిస్టు టీంతో షూట్ చేసిన క్లైమాక్స్ సీక్వెన్స్ పూర్తయింది. సెట్స్‌లో శర్వానంద్ కుర్చీలో కూర్చొని కనిపిస్తుండగా.. ఎదురుగా జూనియర్ ఆర్టిస్టులు అండ్ విలన్ టీం ఉన్న స్టిల్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. క్లైమాక్స్ సీక్వెన్స్ భోగి సినిమాకే హైలెట్‌గా నిలిచిపోయేలా గూప్‌బంప్స్ తెప్పించబోతుందని ఇన్‌సైడ్ టాక్. ఈ మూవీలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, నిర్మాణం: శ్రీసత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో 1960స్ ఫిక్షనస్ విలేజ్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీ ఆగస్టు 28న గ్రాండ్‌గా విడుదలకు రెడీ అవుతోంది.

# రెండు భాగాలుగా అల్లు అర్జున్ 'రాకా'.. -అట్లీ ఏం ప్లాన్ చేస్తున్నా




టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ 'రాకా' సినిమాకు సంబంధించి ఓ సరికొత్త వార్త ఫిలింనగర్ సర్కిల్స్‌లో వైరల్ అవుతోంది. అనౌన్స్‌మెంట్‌తోనే భారీ అంచనాలను రేకెత్తించిన ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఒక క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. మీడియా కథనాల ప్రకారం, 'రాకా' చిత్రాన్ని మేకర్స్ సింగిల్ పార్ట్‌గా కాకుండా రెండు భారీ భాగాలుగా తెరకెక్కించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఈ రెండు భాగాలను కలిపి ఏకంగా రూ.1000 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నట్లు సమాచారం.ఈ రెండు భాగాలలోనూ ఇద్దరు స్టార్ హీరోయిన్లు అలరించనున్నారు. ఒక భాగంలో అల్లు అర్జున్ సరసన బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణ్ నటిస్తుండగా, మరో భాగంలో టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఇక కథాంశం విషయానికొస్తే, అట్లీ ఈ చిత్రాన్ని అత్యంత వైవిధ్యంగా ప్లాన్ చేశారు. ఒక పార్ట్‌ను పూర్తిగా హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్ మరియు ఫాంటసీ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిస్తుండగా, మరో పార్ట్‌ను పూర్తిగా భిన్నమైన ఫ్యూచరిస్టిక్ ప్రపంచంలో నడిచేలా రూపొందిస్తున్నారట. ఇందులో హిస్టారికల్ నేపథ్యంలో వచ్చే భాగంలో దీపికా పదుకొణ్ నటిస్తుందని తెలుస్తోంది. వీటితో పాటు ఈ చిత్రంలో బాలీవుడ్ బాద్షా షారుఖ్ ఖాన్ ఒక ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించనున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇప్పటికే అట్లీ దర్శకత్వంలో షారుఖ్ నటించిన 'జవాన్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో, ఈ చిత్రంలోనూ ఆయన నటిస్తే సినిమా స్థాయి మరింత పెరుగుతుందని అభిమానులు భావిస్తున్నారు.



# అమ్మ నన్ను వాట్సాప్‌లో బ్లాక్ చేసింది..

– స్టార్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే ఎమోషనల్ కామెంట్స్ వైరల్

టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో దూసుకుపోతున్న యువ కథానాయిక భాగ్యశ్రీ బోర్సే తన సినీ ప్రయాణంలో ఎదుర్కొన్న కష్టాలను తాజాగా అభిమానులతో పంచుకున్నారు. అఖిల్ అక్కినేని సరసన నటించిన 'లెనిన్' సినిమా బ్లాక్‌బస్టర్ విజయంతో టాలీవుడ్‌లో క్రేజీ హీరోయిన్‌గా మారిన ఈ పూణే భామ, ఇటీవల ఓ కాలేజీలో నిర్వహించిన ఇంటరాక్టివ్ టాక్ షోలో పాల్గొని తన వ్యక్తిగత జీవితం, సినీ కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. చిన్నప్పటి నుంచే నటనపై తనకు అమితమైన ఆసక్తి ఉండేదని భాగ్యశ్రీ తెలిపారు. అయితే సినిమాల్లోకి రావాలన్న తన నిర్ణయాన్ని కుటుంబ సభ్యులు మొదట అస్సలు అంగీకరించలేదని చెప్పారు.జీవితంలో మనం తీసుకునే నిర్ణయాలకు చివరికి మనమే బాధ్యత వహించాలి. ఇతరుల కోసం మన కలలను వదులుకుంటే తర్వాత పశ్చాత్తాపపడాల్సి వస్తుంది. అందుకే నటిగా మారాలనుకుంటున్నానని ముందుగా అమ్మకు చెప్పాను. కానీ ఆమె వెంటనే 'వద్దు' అని చెప్పింది. తర్వాత నాన్నతో మాట్లాడితే, 'అమ్మ వద్దన్న పని నువ్వెలా చేస్తావు?' అని అడిగారు. కనీసం అక్క అయినా నాకు మద్దతు ఇస్తుందనుకున్నా, ఆమె కూడా అమ్మానాన్నల మాటే వినాలని చెప్పింది. ఇంట్లో అందరూ నా నిర్ణయాన్ని వ్యతిరేకించారు" అని ఆమె గుర్తు చేసుకున్నారు.కుటుంబం నుంచి వ్యతిరేకత ఎదురైనా తన కలను వదులుకోలేదని భాగ్యశ్రీ చెప్పారు. నేను ఆడిషన్స్‌కు వెళ్లడం మొదలుపెట్టిన తర్వాత ఇంట్లో పరిస్థితి మరింత కఠినంగా మారింది. నా నిర్ణయం నచ్చక అమ్మ దాదాపు ఆరు నెలల పాటు నాతో మాట్లాడలేదు. అంతేకాదు, వాట్సాప్‌లో కూడా నన్ను బ్లాక్ చేసింది. ఇప్పుడు ఆ విషయాలను నవ్వుకుంటూ చెప్పగలుగుతున్నా... ఆ రోజుల్లో మాత్రం చాలా బాధపడ్డాను. అయితే తల్లిదండ్రులకు సినిమా పరిశ్రమపై కొన్ని భయాలు ఉండటం సహజం. అందుకే వారు అలా స్పందించారు అంటూ భావోద్వేగానికి లోనయ్యారు. కుటుంబ సభ్యుల అభ్యంతరాలను అధిగమించి సినీ రంగంలో అడుగుపెట్టిన భాగ్యశ్రీ బోర్సే, రవితేజ హీరోగా నటించిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. తొలి చిత్రంతోనే తన అందం, అభినయంతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఆమెకు వరుస అవకాశాలు వచ్చాయి.ఆ తర్వాత విజయ్ దేవరకొండ సరసన 'కింగ్‌డమ్', రామ్ పోతినేనితో 'ఆంధ్ర కింగ్ తాలూకా', దుల్కర్ సల్మాన్తో 'కాంత' వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో అవకాశం దక్కించుకున్నారు. అయితే అఖిల్ అక్కినేనితో చేసిన 'లెనిన్' సినిమా ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. ఇందులో 'భారతి' పాత్రలో ఆమె నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభించాయి.

# సన్నీడియోల్ కొడితే షారుక్‌ఖాన్ స్టార్ అయ్యారు..

–'గబ్బర్ సింగ్' విలన్ కామెంట్స్ వైరల్



బాలీవుడ్ యాక్టర్లు సన్నీడియోల్, ప్రీతి జింటా లీడ్ రోల్స్‌లో తెరకెక్కిన సినిమా 'బట్వారా 1947:. ఆగస్టు 14న విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ సందర్భంగా 'గబ్బర్ సింగ్' విలన్ అభిమన్యు సింగ్ మాట్లాడుతూ.. సన్నీ డియోల్‌ను కొట్టిన తర్వాతే షారుఖ్ ఖాన్ స్టార్‌గా ఎదిగారంటూ కామెంట్ చేయడం టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది.ఈ విషయం గురించి అభిమన్యు సింగ్ మాట్లాడుతూ.. సన్నీడియోల్ ఒక మెగాస్టార్. 'దర్' (ఖుతీతీ) సినిమా షూటింగ్ సమయంలో సన్నీడియోల్ షారుక్‌ఖాన్‌ను కొట్టారు. ఈ విషయం ప్రతీ యాక్టర్‌కు తెలుసు. కానీ షారుక్‌ఖాన్ అభిమానులు, కొందరు పాకిస్థానీ జిహాదీ ముస్లింలు దీన్ని నమ్మరు. ఏదేమైనా సన్నీడియోల్ షారుక్ ఖాన్‌ను కొట్టడం వల్లే దర్ సినిమాకు మంచి పబ్లిసిటీ అయి బ్లాక్ బస్టర్ అయిందనేది నిజమని అన్నాడు. ఆ దెబ్బ కారణంగా షారుక్ ఖాన్‌కు సానుభూతి లభించింది. ఆ తర్వాత షారుక్ ఖాన్ స్టార్‌గా ఎదిగారని చెప్పుకొచ్చాడు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.తెలుగులో పవన్‌కల్యాణ్ హీరోగా నటించిన గబ్బర్ సింగ్ సినిమాలో విలన్‌గా సూపర్ యాక్టింగ్‌తో మంచి క్రేజ్ సంపాదించుకున్నాడు అభిమన్యు సింగ్. రక్త చరిత్ర ప్రాంచైజీ, బెజవాడ, దేవర ప్రాంచైజీ, ఓజీలో కూడా నటించాడు.

# ఓటీటీలోకి తమిళ్ బ్లాక్ బస్టర్ 'గట్టా కుస్తీ 2'.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే.!



తమిళ టాలెంటెడ్ నటుడు విష్ణు విశాల్, కథానాయిక ఐశ్వర్య లక్ష్మి జంటగా నటించిన స్పోర్ట్స్ కామెడీ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'గట్టా కుస్తీ 2:(మట్టి కుస్తీ) డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి థియేటర్లలో మంచి స్పందనతో బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శించబడిన ఈ చిత్రం, ఇప్పుడు ఓటీటీ ద్వారా ప్రేక్షకులను అలరించడానికి వస్తోంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్ హక్కులను దక్కించుకుంది. ఈ క్రమంలోనే సినిమాను జూలై 31 నుంచి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి తెస్తున్నట్లు అధికారిక ప్రకటించింది.ఈ చిత్రాన్ని కేవలం తమిళ భాషకే పరిమితం చేయకుండా, తెలుగు, కన్నడ, మలయాళ మరియు హిందీ భాషల్లో ఒకేసారి స్ట్రీమింగ్ చేయనున్నారు. దర్శకుడు చెల్లా అయ్యావు దర్శకత్వం వహించిన ఈ సీక్వెల్‌లో సీనియర్ నటి రమ్యకృష్ణ, ప్రముఖ హాస్య నటుడు యోగి బాబు, కరుణాకరన్ తదితరులు కీలక పాత్రల్లో నటించి మెప్పించారు. మొదటి భాగం మాదిరిగానే ఈ రెండో భాగం కూడా థియేటర్లలో మంచి వినోదాన్ని మరియు కుటుంబ భావోద్వేగాలను పంచింది.